మహిళల హక్కుల కోసం పోరాడిన అంబేద్కర్

● స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాంరెడ్డి

విద్యార్థినులకు పుస్తకా పంపిణీ

బొడ్రాయిబజార్, మార్చి 28 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తొలి న్యాయ శాఖ మంత్రిగా ఉండి మహిళల హక్కుల కోసం ఎంతో పోరాటం చేశారని, ఆ హక్కులతో ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి, చీఫ్ లీగలైడ్ డిఫెన్స్ కౌన్సిల్ వసంత సత్యనారాయణపిళ్లై అన్నారు. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సంఘమిత్ర ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం జ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ మహిళా సాధికారత, రాజ్యాంగ హక్కుల కోసం అహర్నిశలు కష్టపడి తన ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా హిందూ కోడ్ బిల్ తయారు చేసి పార్లమెంటులో ప్రవేశపెట్టారన్నారు. బిల్లు తేవాలని నాటి ప్రధాన మంత్రి నెహ్రూను కోరితే వారు వారించారని, దీంతో మనోవేదనకు గురైన అంబేద్కర్ తన మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఆయన కోరుకున్న విధంగా విద్యార్థినులు కష్టపడి చదివితేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని, ఆర్థికంగా బలపడుతారని అన్నారు. అనంతరం అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు అందజేశారు. సదస్సులో సొసైటీ అధ్యక్షుడు తలమల్ల హసేన్, ప్రిన్సిపాల్ సునీల, వైస్ ప్రిన్సిపాల్ ప్రవళిక, పూర్వ న్యాయవాది గాదె రమాదేవి, అధ్యాపకులు దీపిక, అఖిల్ పాల్గొన్నారు.

టీకాలపై పాడి రైతుల సందేహాలను నివృత్తి చేయాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

రికార్డులను పరిశీలిస్తున్న డైరెక్టర్ పెంటయ్య

అనంతగిరి, మార్చి 28 : పశువులకు గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాలు వేసే సమయంలో రైతుల సందేహాలను నివృత్తి చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెంటయ్య సిబ్బందికి సూచించారు. మండలంలోని శాంతినగర్‌లో గురువారం టీకాల పంపిణీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పశువులకు టీకాలు వేయాలని, కోల్డ్ చెయిన్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అత్యవసర కిట్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పశువులకు బార్ కోడ్ చెవి పోగులు కచ్చితంగా వేయాలని, ఆ నెంబర్‌ను భారత్ పశుధాన్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పశువుల్లో శాస్త్రీయ వ్యాధి నిర్ధారణకు ప్రాథమిక పశు వైద్య కేంద్రాల్లో పశువుల రక్తం, పేడ, చర్మ నమూనాలను పరీక్షించేందుకు అత్యాధునిక పరికరాలు, మైక్రోస్కోప్‌లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ఆయన వెంట మండల పశు వైద్యాధికారి సురేందర్, పంచాయతీ కార్యదర్శి అహ్మదాబేగం, జయమ్మ, రైతులు పాల్గొన్నారు.

సామూహిక వేడుకలతో సమస్యలు దూరం

సామూహిక పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

కోదాడ టౌన్, మార్చి 28 : సమస్యలను మరిచి సంతోషంగా గడిపేందుకు సామూహిక వేడుకలు ఎంతగానో ఉపయోగపడుతాయని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మార్చి నెలలో జన్మించిన విశ్రాంత ఉద్యోగుల పుట్టిన రోజు వేడుకలను గురువారం సామూహికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందంగా, సంతోషంగా ఉంటేనే ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం పుట్టిన రోజు జరుపుకొంటున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షుడు మల్లెపల్లి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, నాయకులు జగన్మోహన్, వరప్రసాదరావు, భ్రమరాంబ, శోభ, రఘువరప్రసాద్, నర్సయ్య, భిక్షం పాల్గొన్నారు.

పుట్‌పాత్ ఆక్రమిస్తే చర్యలు తప్పవు

● ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ టౌన్, మార్చి 28 : వీధి వ్యాపారులు పుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని కోదాడ ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై పుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డును ఆక్రమించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దన్నారు. నడక దారిని ఆక్రమించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు దుకాణాల తొలగింపు చేపట్టామని, వీధి వ్యాపారులు సహకరించాలని కోరారు.

నేత్రదానం చేసిన పాండురంగయ్య కుటుంబానికి సన్మానం



పాండురంగయ్య కుమారులను సన్మానించి ప్రశంసా పత్రం అందజేస్తున్న మిర్యాలగూడ డైమండ్ నేత్ర నిధి సభ్యులు

నేరేడుచర్ల, మార్చి 28 : గరిణె పాండురంగయ్య ఈ నెల 17న అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ట్రస్ట్‌కు దానం చేశారు. ఈ సందర్భంగా గురువారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాండురంగయ్య సతీమణి ధనలక్ష్మి, కుమారులు వాసు, సతీశ్‌ను సత్కరించారు. అనంతరం మిర్యాలగూడ డైమండ్ నేత్ర నిధి సెక్రటరీ మిట్టపల్లి విజయభాస్కర్, ఉప్పల రామ్‌నరేశ్ వారికి ప్రశంసా పత్రం అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సభ్యులు నటరాజ్, గోపాలకృష్ణ, రాము పాల్గొన్నారు.

సోషల్ మీడియా ప్రచారాలకు అనుమతి తప్పనిసరి

● కలెక్టర్, సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్

నేరేడుచర్లలో మంచినీటి సరఫరాపై అధికారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 28 : సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, ప్రకటనలపై నిఘా ఉంటుందని, వాటికి ముందస్తు అనుమతులు తప్పకుండా తీసుకోవాలని సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి గురువారం ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్, ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఎక్కువగా వస్తున్నందున ఎన్నికల కమిషన్ వీటిపై పూర్తి నిఘా పెట్టిందన్నారు. అందుకోసం సోషల్ మీడియా ట్రాకింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రంలోనే ముందస్తు అనుమతులు తీసుకొని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై సోషల్ మీడియాలో వచ్చే వాటిని పరిశీలనలోకి తీసుకొని చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఆర్ఓ రమేశ్‌కుమార్, డీఈ మల్లేశం, ఏఓ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

గరిడేపల్లి : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ వనజ, ఎంపీఓ మౌలానా, ఆర్ఐ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి సుధీర్ బాబు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

నేరేడుచర్ల : వేసవిలో తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకట్రావ్ అధికారుకు సూచించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని విజయదుర్గ ఆలయం సమీపంలో మంచినీటి ట్యాంక్ వద్ద పైప్‌లైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తాగునీటికి సంబంధించిన బోర్లు, చేతిపంపులు, మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు, మిషన్ భగీరథ నీటి సరఫరాలో లోపాలు రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. నీటి సరఫరాకు సంబంధించి పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ విజయకుమారి, మున్సిపల్ మేనేజర్ అశోక్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట్‌రెడ్డి, ఏఈ మహేశ్, ఏపీఎం శేఖర్, మున్సిపల్ ఏఈ స్వాతిరెడ్డి, ఆర్ఐ నర్సయ్య ఉన్నారు.

కాశీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం జాయింట్ సెక్రటరీగా దయాకర్‌గుప్తా

నియామక పత్రం అందుకుంటున్న దయాకర్‌గుప్తా

బొడ్రాయిబజార్, మార్చి 28 : వారణాసిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రం జాయింట్ సెక్రటరీగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ఈగా దయాకర్‌గుప్తా ఎంపికయ్యారు. కాశీలో భక్తుల సౌకర్యార్థం వారణాసి (కాశీ) గురుభాగ్‌లో నూతనంగా కాశీ విశ్వేశ్వరస్వామి ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదాన సత్రాన్ని ఫౌండర్ రత్నకుమార్ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు దయాకర్‌గుప్తా తెలిపారు. అన్నదాన సత్రం ట్రస్ట్‌కు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

నేరేడుచర్ల, మార్చి 28 : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలోని చిల్లేపల్లి చెక్‌పోస్టు వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మిర్యాలగూడ – కోదాడ రహదారిపై వచ్చి పోయే వాహనాల్లో నిబంధలనకు విరుద్ధంగా డబ్బు, మద్యం, బంగారం తరలించకుండా క్షణ్ణంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, జూనియర్ అసిస్టెంట్లు టీఎంఎల్ నరసింహారావు, అనిల్, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు

రాయినిగూడెంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గరిడేపల్లి, మార్చి 28 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ప్రతిఒక్కరూ శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని హుజూర్‌నగర్ సీఐ జి.చరమందరాజు అన్నారు. మండలంలోని గరిడేపల్లి, రాయినిగూడెం, పొనుగోడు, వెలిదండ, కొత్తగూడెం గ్రామాల్లో గురువారం పోలీసులు, పారా మిలిటరీ దళాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైందన్నారు. ఓటర్లలో ధైర్యం కల్పించేందుకే ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గరిడేపల్లి ఎస్ఐలు ఈట సైదులు, నరేశ్, పోలీసులు, పారా మిలిటరీ దళ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాలకవీడు, మార్చి 28 : మండలంలోని మహంకాళిగూడెం గ్రామ శివారులో అక్రమంగా రవాణా చేస్తున్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ లక్ష్మీనర్సయ్య తెలిపారు. దామరచర్ల మండల కేంద్రానికి చెందిన కందుల సైదిరెడ్డి సూచనల మేరకు మహంకాళిగూడెం గ్రామానికి చెందిన నన్నెపంగు మారతమ్మ ఊరిలో తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో నిల్వ ఉంచింది. గురువారం దామరచర్లకు చెందిన చెన్నబోయిన చంద్రశేఖర్ ట్రాక్టర్‌లో తరలిస్తుండగా శూన్యంపహాడ్ వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● గరిడేపల్లి ఎంపీపీ సుజాత

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుజాత

గరిడేపల్లి, మార్చి 28 : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు చూడాలని ఎంపీపీ పెండెం సుజాత సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. అనంతరం పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. కొత్త అప్పన్నపేటలో బిల్లు మంజూరు కాగానే విద్యుత్ లైన్ మార్చుతామని ఏఈ నగేశ్ తెలిపారు. మహిళా సంఘాలకు రుణాలు ఇప్పించే సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్న వీఓఏలకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని ఏపీఎం శ్రీనివాస్‌ను ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.వనజ, ఎంపీఓ మౌలానా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సూర్యాపేట మార్కెట్ యార్డుకు సెలవు

బొడ్రాయిబజార్, మార్చి 28 : గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుతోపాటు కార్యాలయానికి సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, కమీషన్‌దారులు, వ్యాపారులు సహకరించాలని కోరారు.

వచ్చే నెల 4న మిర్యాల ఆలయ భూములకు వేలం

నూతనకల్, మార్చి 28 : మండలంలోని మిర్యాల గ్రామంలో సీతారామచంద్రస్వామి దేవాలయ భూములకు 2024-2025 సంవత్సరానికిగాను ఏప్రిల్ 4న వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కుశలవ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 102 ఎకరాల ఆలయ భూములకు ఒక సంవత్సరం కౌలుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు లక్ష నగదు గానీ, డీడీ రూపంలో గానీ డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో దేవాలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రామచంద్రారావు, మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, శ్రీనివాస్, దశరథ, కిరణ్ పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

అర్వపల్లి, మార్చి 28 : బలహీన వర్గాలకు చెందిన భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జీడి సుందర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు వినిపించే అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ నోముల రమేశ్, బూర్గుల రాంబాబు, జీడి నర్సయ్య, బ్రహ్మచారి, రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేరేడుచర్ల, మార్చి 28 : మండలంలోని ముకుందాపురం సబ్‌స్టేషన్ పరిధిలో కల్లూరు ఫీడర్ కింద శుక్రవారం ఉదయం 8:30 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్లూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున కల్లూరు, లాల్‌లక్ష్మీపురం గ్రామాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

వైన్స్‌లో చోరీ

మునగాల, మార్చి 28 : మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామంలో గల లక్ష్మీగణేశ్ వైన్ షాపులో బుధవారం రాత్రి చోరీ జరిగింది. 75వేల నగదును అపహరించుకుపోయారు. వివరాలిలా ఉన్నాయి.. వైన్‌షాపు నిర్వాహకులు రోజు మాదిరిగా బుధవారం రాత్రి పది గంటలకు షాపును మూసి ఇండ్లకు పోయారు. గురువారం ఉదయం సిబ్బంది వచ్చేసరికి కౌంటర్ తెరిచి ఉంది. అందులో ఉంచిన రూ.75వేలు చోరీకి గురైనట్లు గుర్తించారు. దుండగులు తాళాలు తీయకుండా పై రేకులు జరిపి లోపలికి ప్రవేశించి నగదు తీసుకొని మళ్లీ యథావిధిగా పెట్టినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు షాపులో పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. దుండగుడు మాస్క్ ధరించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యిందని పోలీసులు తెలిపారు.

సహకార సంఘం బలోపేతానికి రైతులు సహకరించాలి

చిలుకూరు, మార్చి 28 : సహకార సంఘం బలోపేతానికి రైతులందరూ సహకరించాలని చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్ అన్నారు. చిలుకూరు ప్రాథమిక సహకార సంఘంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ ద్వారా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను అందిస్తున్నామన్నారు. ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించి రైతులకు తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. రైతులు సకాలంలో రుణాలను చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సూచించారు. అనంతరం సంఘంలోని జమా ఖర్చులను చదివి వినిపించారు. సమావేశంలో వైస్ చైర్మన్ గన్నా పద్మావతి, డైరెక్టర్లు కొండా సోమయ్య, కొడారు రాంబాబు, బెల్లంకొండ సైదులు, కస్తూరి సైదులు, పాయిలి నాగరాజు, శ్రీహరి, సీఈఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుదర్శన్‌రెడ్డి

నూకల సుదర్శన్‌రెడ్డి

సూర్యాపేట లీగల్, మార్చి 28 : సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూకల సుదర్శన్‌రెడ్డి ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎన్నికల్లో జటంగి వెంకటేశ్వర్లుపై 24ఓట్ల ఆధిక్యంతో సుదర్శన్‌రెడ్డి గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా ఎంఎన్ వరప్రసాద్, కార్యదర్శిగా డి.మల్లయ్య, సంయుక్త కార్యదర్శిగా పి.వాణి, గ్రంథాలయ కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ లతీఫ్, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా జి.చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులుగా చంద్రమౌళి, సుంకర రవి, డి.వెంకట్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ తెలిపారు.

కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్ఆర్‌కే మూర్తి

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్ఆర్‌కే మూర్తిని సన్మానిస్తున్న న్యాయవాదులు

కోదాడ టౌన్, మార్చి 28 : కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది శ్రీనివాసుల రాధాకృష్ణమూర్తి ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికల్లో 59 ఓట్ల మెజార్టీతో ఆయన విజయం సాధించారు. మొత్తం 106 ఓట్లు పోల్ కాగా, అందులో ఒకటి చెల్లలేదు. ఉపాధ్యక్షుడిగా గట్ల నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా చింతకుంట్ల రామిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా సరికొండ హనుమంత్ రాజు, కోశాధికారిగా కోడూరు వెంకటేశ్వర్ రావు, గ్రంథాలయ కార్యదర్శిగా మందా వెంకటేశ్వర్లు, క్రీడా కార్యదర్శిగా పోలూరి హేమలత, మహిళా ప్రతినిధిగా ఓరుగంటి ధనలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా దొడ్డ శ్రీధర్, సామా నవీన్‌కుమార్, నాగుల్ పాషా ఎన్నికయ్యారు. ప్రధాన ఎన్నికల అధికారిగా వి.రంగారావు, ఉప ఎన్నికల అధికారిగా జానీ పాషా, సహాయ ఎన్నికల అధికారిగా ఆవుల మల్లికార్జున్‌రావు వ్యవహరించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్ఆర్‌కే మూర్తిని న్యాయవాదులు సన్మానించారు. నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. పటాకులు కాల్చి సంబురాలు జరుపుకొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, మార్చి 28 : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్యతోపాటు కార్యవర్గ సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాంరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం న్యాయవాదులు అధ్యక్షుడు రాంరెడ్డిని సన్మానించారు.

బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ప్రదీప్తి

నేరేడుచర్ల, మార్చి 28 : హుజూర్‌నగర్ నియోజకవర్గ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన సుంకరి ప్రదీప్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 21న నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రదీప్తి ఎన్నిక కాగా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రదీప్తి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ఉండ్రుగొండ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు

ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హోమం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల, మార్చి 28 : మండలంలోని ఉండ్రుగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు గురువారం శ్రీమాన్ అరవిందాచార్యులు, సుబ్రమణ్యాచార్యులు, శ్రీమాన్ కృష్ణమాచార్యులు స్వస్తి వాచనం, విన్నపాలు, బాలబోగం, తీర్థ గోష్టి, నిత్యహోమం, సుదర్శన నారసింహ హోమం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా హైదరాబాద్, గుంటూరు, మహబూబాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ లక్ష్మీనారాయణ

హుజూర్‌నగర్, మార్చి 28 : విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట ఐటీ సెల్ సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, పోక్సో చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలను ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య, పాఠశాల హెచ్ఎం లతీఫ్, ఏఎస్ రమేశ్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీకి పేర్లు నమోదు చేసుకోవాలి

నూతనకల్, మార్చి 28 : ఫిజియోథెరపీ కోసం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంఈఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గురువారం ఫిజియోథెరపీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఫిజియోథెరపీ శిక్షణ అందించడం ద్వారా వారిలో మనో ధైర్యాన్ని పెంచవచ్చన్నారు. ప్రతి మంగళవారం ఎమ్మార్సీ